అధ్వానంగా పంట పొలాలకెళ్లే దారులు

- వ్యవసాయం చేసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్న రైతులు
- వర్షాలు తగ్గిపోగానే మరమ్మతులు చేయాలంటున్న రైతులు

చాపాడు : మండలంలోని మొర్రాయిపల్లె, సిద్దారెడ్డి పల్లె, నాగాయపల్లె, రేపల్లె గ్రామాల నుంచి పంట పొలాలకు వెళ్లేదారులు అధ్వానంగా ఉన్నాయి. గత నెలలో కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల కాగా వ్యవసాయం చేసుకునేందుకు రైతులు సమాయాత్తమవుతున్నారు. అయితే ఈ గ్రామాల నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు ఉండే మట్టి రోడ్లు దెబ్బతిన్నాయి. గత ఏడాదిగా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో గత వారం రోజుల క్రితం నుంచి కురుస్తున్న భారీ వర్షాల వలన పొలాలకు వెళ్లే దారులు మరింత గుంతల మయంగా మారాయి. ఈ క్రమంలో ఈ దారులు అస్తవ్యస్థంగా మారడంతో రైతులు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటితో ఈ దారులు బురదమయంగా మారడంతో దారిలో వెళ్లే రైతులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. వృద్ధులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. ప్రస్తుతం వరి నారుమళ్లు సిద్ధం అవడంతో వందల ఎకరాల్లో వరి నాటుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో దారులు అనుకూలంగా లేకపోవడంతో పంటలను సాగు చేసుకోవాలనే ఆందోళనలో రైతులు ఉన్నారు. పంట సాగుతో పాటు పంట కాలమంతా ఎరువులు చల్లుకోవడం, పురుగు మందులు పిచికారి చేసుకోవడం, కలుపులు తీసుకోవడంతో పాటు ఇంకా ఇతరత్రా పనులు చేసుకునేందుకు ఈ దారుల్లో వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిందేనని రైతులు బావిస్తున్నారు. ఈ క్రమంలో వర్షాలు తగ్గిపోగానే అధికారులు స్పందించి ఇబ్బందికరంగా ఉన్న మట్టి రోడ్లకు మరమ్మతులు చేసి గ్రావెల్ వేస్తే వ్యవసాయ పనులు చేసుకునేందుకు దారులు అనుకూలంగా ఉంటాయని రైతులు కోరుకుంటున్నారు.

పొలాల్లోకి వెళ్లాలంటే నానా ఇబ్బందులు



మా గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే దారి గుంతలు పడి చాలా అధ్వానంగా మారింది. ఒక సారి వర్షం వస్తే రోజుల తరబడి బురదగుంతలతో ఈ దారిలో వెళ్లలేము. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు కూడా వెళ్లాలంటే ఇబ్బందులే. రైతుల దుస్థితిని అధికారులు పట్టించుకుని దారులకు బాగు చేయాల్సిన అవసరం ఉంది.

-మోపిరిరెడ్డి, రైతు, మొర్రాయిపల్లె, చాపాడు మండలం

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



పంట పొలాలకు వెళ్లే దారులు గుంతలు పడి చాలా అధ్వానంగా మారాయి. ఈ దారుల్లో వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోవాలంటే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గిపోగానే దెబ్బతిన్న దారుల్లో గ్రావెల్ వేసి మరమ్మతులు చేపట్టాలి. వ్యవసాయం కోసం అవసరమైనవి తీసుకెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాము.

- నారాయణరెడ్డి, రైతు, మొర్రాయిపల్లె, చాపాడు



అధ్వానంగా మొర్రాయిపల్లె నుంచి పంట పొలాలకు వెళ్లేదారి

పీఎం ఫసల్ బీమాకు గడువు పొడిగింపు

మైదుకూరు : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు సాగు చేసిన పంటలకు బీమా చేసుకునేందుకు గడువును ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వరి, జొన్న, ఉల్లి, పసుపు వంటి పంటలు సాగు చేసిన రైతులు తమ పంటకు బీమా చేసుకోవడానికి ఈనెల 15 వరకు గడువు ఉండేదని, దానిని కేంద్ర ప్రభుత్వం ఈనెల చివరి వరకు పొడిగించిందని ఏఓ వివరించారు. ఎవరైనా రైతులు ఇంకా పంటల బీమా చేసుకోకపోతే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్రీడా పోటీలు

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం లగోరి క్రీడా పోటీలను నిర్వహించారు. లగోరి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో కడప జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



వృద్ధాశ్రమంలో పండ్లు, మందులను అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మైదుకూరుకు చెందిన యూనియన్ నాయకులు వృద్ధులకు, రోగులకు పండ్లు, మందులను పంపిణీ చేశారు. మైదుకూరు సమీపంలోని ఖాజీపేట మండలం భూమాయపల్లె వద్ద ఉన్న అమ్మ వృద్ధాశ్రమంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు కరెడ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు, మందులు అందించారు. అంతకుముందు మైదుకూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం పట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివకృష్ణ విలేకరులను అభినందించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజేకు చెందిన ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తోట రామ మోహన్, బొమ్మిశెట్టి మోహన్, కొట్టి చంద్ర, శేగినేని మురళి, చొక్కం ప్రసాద్, యాపరాల ప్రసాద్, వరకుమార్, రవీంద్ర, రంజిత్, సురేష్(చంటి), గౌస్ పీర్, శివ, సురేష్, మధు పాల్గొన్నారు.

చెన్నమరాజుపల్లె సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి నియామకం



చంద్రశేఖర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు చెన్నమరాజుపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా పల్లేటి చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా రాజువారి వెంకటసుబ్బయ్య, రాజేశ్వరిలు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, నంద్యాల రాఘవరెడ్డి, బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి, బద్వేలి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు వాసికి పీహెచ్‌డీ



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మహదేవన్ నుంచి పీహెచ్‌డీని అందుకుంటున్న నరసింహారెడ్డి

మైదుకూరు : మైదుకూరు పట్టణానికి చెందిన తిమ్మారెడ్డి నరసింహారెడ్డి విట్(వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ ఫ్రాక్షనల్ ఫ్రీక్వెన్సీ ట్రాన్స్‌మిషన్ సిస్టం ఫర్ ఆఫ్షోర్ విండ్ ఫార్మ్స్' అనే అంశంపై యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఐ.జాకోబ్ రాగ్లేండ్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. ప్రస్తుతం బెంగళూరు విప్రోలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఈయన జేఎన్‌టీయూఏలో బీటెక్, జేఎన్‌టీయూహెచ్‌లో ఎంటెక్ చేశారు. ఆదివారం డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విట్ విశ్వవిద్యాలయంలో జరిగిన 40వ కాన్వొకేషన్ డే కార్యక్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఆర్.మహదేవన్ చేతుల మీదుగా తాను పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నట్టు వివరించారు.

వర్షం కురవాలని వన భోజనం



డప్పు వాయిద్యాల నడుమ వనభోజనానికి వెళుతున్న ఆకులనారాయణపల్లె వాసులు

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామస్తులు వర్షం కురవాలని పోలేరమ్మకు వనభోజనం పెట్టారు. ఆదివారం డప్పు, మంగళవాయిద్యాలతో మహిళలు గంపలో బోనాలను పెట్టుకుని వన భోజనానికి వెళ్లి అక్కడ పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షం కురిపించాలని గ్రామస్తులు అమ్మవారిని మొక్కుకున్నారు. గ్రామంలో సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ ప్యానెల్

సింహాద్రిపురం : ఎస్సీ, ఎస్టీలకు ఇంటిపైన ఉచితంగా సోలార్ ప్యానెల్ బిగించడానికి అవకాశం కల్పించామని ఇన్‌చార్జి ఏఈ దినేష్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు సర్వీసు ఎవరిపైన ఉంటే వారి ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను విద్యుత్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

శాస్త్రీయ పరిశోధన రంగం అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా కార్యదర్శి హేమంత్ కుమార్

ప్రొద్దుటూరు కల్చరల్ : శాస్త్రీయ పరిశోధన రంగం మరింత అభివృద్ధి చెందాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక నందినీ క్లాత్‌మార్కెట్‌లోని తమ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జన విజ్ఞాన వేదిక పట్టణ మహాసభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెరగకుండా ప్రభుత్వాలు పాఠ్యాంశాలను తొలగించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం సైన్స్ రంగంపై దాడి చేస్తోందని, సైన్స్‌కు బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేస్తున్నారన్నారు. ఇతర దేశాల్లో శాస్త్ర రంగానికి బిలియన్ల కేటాయిస్తుంటే భారత్‌లో అతి తక్కువ కేటాయింపులు ఉన్నాయన్నారు. సూడో సైన్స్‌ను ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయని, విద్యలో నాణ్యత పెరగాలని, సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రైవేట్ పెట్టుబడులను ఆపాలని కోరారు. జేవీవీ వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జేవీవీ అవసరం ఎంతో ఉందని, ప్రజల్లో శాస్త్రీయ ప్రచారాన్ని పెంచాలన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పర్యావరణం వినాశనం కాకుండా అవగాహన పెంచాలన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, దానిని తగ్గించే దిశగా ప్రభుత్వాలు పని చేయాలన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న మూఢనమ్మకాలను తొలగించాలన్నారు. ప్రజలందరూ హేతుబద్ధంగా ఆలోచించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుబ్బయ్య, జేవీవీ పట్టణ ఉపాధ్యక్షుడు రాశేఖర్, సునీత, డాక్టర్ చక్రధర్, మురుకూటి సూర్యనారాయణరెడ్డి, ఉషారాణి, రాజేష్, రవిశంకర్, శివనాథ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కన్వీనర్ వెంకటరామయ్య

అట్లూరు : బద్వేలు నియోజకవర్గంలోని కుంటి మల్లారెడ్డి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగే కుంటి మల్లారెడ్డి వృత్తిదారుల సదస్సును జయప్రదం చేయాలని బద్వేలు డివిజన్ కన్వీనర్ ఐ.వెంకటరామయ్య, కో కన్వీనర్ సుంకర శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సదస్సు జయప్రదం కోసం జన సమీకరణలో భాగంగా ఆదివారం మండలంలోని చిన్నకామసముద్రం గ్రామంలో వారు మాట్లాడుతూ జిల్లాలో అనేక రకాల వృత్తిదారులు ఉన్నప్పటికీ ఇళ్లు, భూమి కోసం అవస్థలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని వృత్తిదారులందరి న్యాయమైన సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదరికంతో అనేక ఇబ్బందులు పడుతున్న వృత్తిదారులకు వ్యక్తిగత రుణాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సోమవారం జరిగే సదస్సుకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని, సదస్సులో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, ఈ సదస్సుకు వృత్తిదారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విధి నిర్వహణలో ఆత్మ తృప్తి ముఖ్యం



బదిలీ అయిన వారిని సత్కరించిన అర్బన్ సీఐ, ఎస్ఐలు

మైదుకూరు : ఏ ఉద్యోగికైనా విధి నిర్వహణలో ఆత్మ తృప్తి అనేది ఎంతో ముఖ్యమని మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి అన్నారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన పోలీసులకు ఆదివారం అర్బన్ సీఐ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బదిలీ అయిన ఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుల్ రహీం, కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, రెడ్డయ్య, సుదీప్‌లను సీఐ, అర్బన్ ఎస్ఐలు చిరంజీవి, ఎస్.సుబ్బారావు ఘనంగా సత్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడటంలో, నేరాలను అదుపు చేయడంలో స్టేషన్‌కు మంచి పేరు వచ్చిందంటే అందులో వాహన డ్రైవర్ నుంచి అన్ని స్థాయిల్లో ప్రతి ఒక్కరూ బాగా విధులు నిర్వహించడం వల్లనే జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందినా, అందకపోయినా విధి నిర్వహణ ఎవరికి వారికి ఆత్మ తృప్తినివ్వాలన్నారు. అర్బన్ ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్ నుంచి బదిలీ అయిన వారు నిరంతరం వారి సేవలను అందించడం అభినందనీయమన్నారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడదాం



గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న పూర్వ విద్యార్థులు

బి.కోడూరు : మండలంలోని సగిలేరు వద్ద ఉన్న గురుకుల పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించి పాటుపడతామని పూర్వపు విద్యార్థులు ఎల్.సుబ్బారావు, టి.దేవేంద్ర, వై.యేసయ్య తెలిపారు. ఆదివారం 1992 సంవత్సరానికి సంబంధించిన సుమారు 50 మంది పూర్వపు విద్యార్థులు పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992లో పాఠశాల ఏ స్థితిలో ఉందో ప్రస్తుతం అదే స్థితిలో ఉందే తప్ప ఎలాంటి మార్పు లేదని, ఆనాటి కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, పాఠశాల ప్రహరీ గోడతో పాటు పాఠశాల గదులు శిథిలావస్థకు చేరి దయనీయంగా ఉన్నాయని చెప్పారు. పాఠశాల ఆవరణ కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉందని గమనించిన వారు స్వయంగా వాటిని తొలగించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావడం, విద్యార్థులకు తాగునీటి సంపును ఏర్పాటు చేయడం, వంటశాల మరమ్మతులు చేయడం వంటి పనులను తమ సొంత డబ్బుతో చేయిస్తామని పాఠశాల ప్రిన్సిపల్ నిరంజన్ వరప్రసాద్‌కు తెలిపారు.

భారీ వర్షాలతో ఉప్పొంగిన నదులు



అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలు పడుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. ప్రొద్దుటూరులోని అగ్నిమాపక కేంద్రాన్ని డీఎస్పీ ఆదివారం సందర్శించారు. వరదల సమయంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఫైర్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పరికరాలను ఆమె పరిశీలించి అగ్నిమాపక అధికారి బసివిరెడ్డితో మాట్లాడారు. అత్యవసర పరిస్థితిలో సహాయం కోసం 101, 112, లేదా 9121100702 అనే నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కడప, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పడుతున్న భారీ వర్షాల మూలంగా పెన్నా, కుందూ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువలు, నదులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. డీఎస్పీ వెంట త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి ఉన్నారు.

షరాబు మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నిక


కొప్పర్తి మధుసూదన్


బుశెట్టి రాజశేఖర్


కేవీ చలపతి

ప్రొద్దుటూరు కల్చరల్ : ది ప్రొద్దుటూరు షరాబు మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నిక ఆదివారం బుశెట్టి ఫాం హౌస్‌లో నిర్వహించారు. అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కొప్పర్తి మధుసూదన్, వైస్ ప్రిసిడెంట్‌గా బుశెట్టిరాజశేఖర్, సెక్రటరీగా కేవీ.చలపతి, జాయింట్ సెక్రటరీగా అలవల మహేష్‌కుమార్, ట్రెజరర్‌గా మేడా మధుసూదన్‌లను ఎన్నుకున్నారు. వారు మూడేళ్లపాటు తమ పదవుల్లో కొనసాగనున్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న నాయకులు, వైద్యులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీరామ్ నగర్‌లోని భద్రావతి భావన్నారాయణస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం పద్మశాలీయ సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్ వైద్యులు 300 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ, 2డీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అగ్గారపు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరామ్‌నగర్, హనుమాన్‌నగర్, వినాయక్‌నగర్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు ప్రాంతాల పేద, మధ్యతరగతి, చేనేత ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ వైద్య శిబిరం ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో వద్ది నరసింహులు, జింకా విజయలక్ష్మి, చెన్నా వెంకటకృష్ణయ్య, తనికంటి మునిరాంప్రసాద్, గునిశెట్టి సునందనరాజశేఖర్, కడప రామిశెట్టి, జలదుర్గం మునిస్వామి, నందం రామయ్య, నందం లక్ష్మణ్‌కుమార్, సురేష్, రాజశేఖర్, చెన్నా చంద్రబాబు, మేరువ మూర్తి, బోగా ఆనంద్, జానపాటి సింగరయ్య, సాదు వీరా, చెన్నా రంగస్వామి, వద్ది రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి



పురవీధుల్లో ఉరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో శ్రీ కృష్ణుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించారు. పురవీధుల గుండా ఊరేగించారు.

రాచమల్లును విమర్శించే అర్హత ప్రవీణ్‌కు లేదు



క్లిప్‌లు చూపుతున్న భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాచమల్లు శివప్రసాదరెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఉంటూ రెండు మార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఇపుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న ఆయనను చెల్లని రూపాయి అని విమర్శించడం సరికాదన్నారు. ప్రవీణ్ నకిలీ నోట్ అని తెలిసే.. ఆయనను కాదని వయసులో పెద్దవాడైన వరదాజులరెడ్డికి టికెట్ ఇచ్చారని తెలిపారు. డ్వాక్రా మహిళలను మోసం చేసిన సంఘటనలో వకల్తా పుచ్చుకొన్న టీడీపీ వారిపైనా, ప్రవీణ్‌తో సహా 9మందిపై కేసు నమోదు చేశారన్నారు. తమ పార్టీ కార్యకర్త బెనర్జీపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన కేసులో సూత్రధారి ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారేగానీ అక్రమ కేసులు కాదని వివరించారు. ప్రవీణ్ స్వలాభం కోసమే లోకేష్‌ను కలిశారని, అతను కలిసినా ఒక్క రూపాయి నిధులు కూడా రాలేదన్నారు. రాచమల్లు శివప్రాదరెడ్డి అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని నాలుగు సార్లే కలిసినా రూ.750 కోట్ల నిధులు ప్రొద్దుటూరుకు తెచ్చారన్నారు. ఇటీవల ఓ ఎర్రచందనం కేసులో అరెస్టయిన ప్రవీణ్ పాత్ర ఏమిటో తెలపాలన్నారు. ఇకనైనా ఇటువంటి విమర్శలు మాని, ప్రొద్దుటూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రసాద్ ఆస్పత్రి సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : ప్రసాద్ ఆసుపత్రి సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల విభాగం కార్యదర్శి డాక్టర్ కల్యాణ చక్రవర్తి తండ్రి దివంగత డాక్టర్ ప్రసాద్ ఆసుపత్రి ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పోరుమామిళ్లలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ డాక్టర్ ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు విద్యాసామగ్రి, అనాథలకు ఆహారం అందిస్తున్నారన్నారు. పోరుమామిళ్ల సర్పంచుగా డాక్టర్ ప్రసాద్ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన వారసత్వాన్ని కళ్యాణ చక్రవర్తి ముందుకు తీసుకపోతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ కుమారులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ వెంకటేశ్వర్లు, కూతురు డాక్టర్ దీప్తి, కోడళ్లు డాక్టర్ మృదుల, డాక్టర్ నాగమణి, అల్లుడు డాక్టర్ వెంకటరమణలతో పాటు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జెడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, అంకన గురివిరెడ్డి, వైస్ ఎంపీపీలు సీ.ఎం.బాషా, రాజశేఖర్, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషా, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, వైష్ణవి పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, రచయిత బొల్లు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. లక్ష్మీపాలెంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన చెర్లో రామాపురం గ్రామానికి చెందిన గోగుల చెంచయ్య కుమారుడు వెంకటరమణ వివాహ వేడుకకు వారు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే శీలంవారిపల్లె గ్రామానికి చెందిన శీలి శ్రీనివాసులు కుమారుడు శ్రీకాంత్ వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ అంకన గురివిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్‌లు పుత్తా శ్రీరాములు, సుబ్బారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నంద్యాల శ్రీనివాసులరెడ్డి, రమాదేవిల కుమారుడు వెంకట నారాయణ రెడ్డి వివాహ వేడుకను ఆదివారం నిర్వహించారు. వేడుకలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, నాయకులు అంకన గురివిరెడ్డి, నారాయణ, సూదా రామకృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, చిత్తా రాజశేఖర్ రెడ్డి, నారాయణ యాదవ్, సుదర్శన్, విజయభాస్కర్‌రెడ్డి, కామూరి రమణారెడ్డి, సింగరయ్య, మధుసూదన్‌రెడ్డి, సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

పతనమైన అరటి ధరలు



అరటి కాయలను సిద్ధం చేస్తున్న కూలీలు



కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు

లింగాల : పులివెందుల ప్రాంతంలో ప్రధాన పంటగా సాగు చేస్తున్న అరటి ధరలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. 10 రోజుల క్రితం ఎగుమతి ధరలు రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు ధరలు పలికేవి. వర్షాలు ప్రారంభమైన వెంటనే ఎగుమతులు ఆగిపోయాయంటూ వ్యాపారులు ధరలు ఒక్కసారిగా తగ్గించేశారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గత 5 నెలల క్రితం వర్షాలు, ఈదురు గాలులకు అరటి తోటలు కుప్పకూలి అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని భావిస్తున్న సమయంలో ఒక్కసారిగా ధరలు తగ్గడంతో అరటి రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. అదేవిధంగా లోకల్ మార్కెట్‌లో అరటి కాయలు టన్ను రూ.10 వేల నుంచి రూ.11 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పంటలకు సాగు చేసేందుకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో వ్యాపారుల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని అరటి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అరటి రైతుల పరిస్థితి అగమ్యగోచరం



రైతులు ఏడాదిపాటు కష్టపడి అరటి పంట పండిస్తే దళారులు చెప్పిన ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ధరలు నిర్ణయించుకునే అవకాశం కూడా లేదు. వారు చెప్పిన ధరలకే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరటి పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

– ప్రభాకర్‌రెడ్డి, అరటి రైతు, లింగాల

అరటి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి



ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు నిర్దిష్టమైన ధరలు ఉన్నాయి. అవి ప్రతి ఏటా పెరుగుతూ పోతున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, ధరలు పెరుగుతూ పోతున్నాయి. అయితే రైతులు పండించే అరటి, చీనీ పంటలు ప్రతి ఏటా ధరలు క్షీణిస్తూ వస్తున్నాయి. నిర్దిష్టమైన ధరలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– చిన్నకేశవ, అరటి రైతు, లింగాల